మట్టి పొరల్లోంచి...



సోమేపల్లి వెంకటసుబ్బయ్య

మట్టి పొరల్లోంచి...

క్రిసెంట్ పబ్లికేషన్స్
29-25-43ఎ, వేమూరివారి వీధి, సూర్యారావు పేట
విజయవాడ – 520 002

MATTI PORALLONCHI...

Somepalli Venkata Subbaiah
E-Mail: svsomepalli@gmail.com

First Edition: May, 2018

Cover Design: Abbu Arts, Chennai

Copies available at:

CRESCENT PUBLICATIONS
29-25-43A, Vemuri Vari Street
Suryarao Pet, VIJAYAWADA - 520 002
E-Mail: crescent.vja@gmail.com

Printed at:

RATNA PRINTING WORKS
VIJAYAWADA - 520 002
Phone: 9030 663666

Rs. **60**/-

అంకితం



సాహితీ పోషకులు,

తెలుగు భాషా ప్రియులు,

సౌజన్యమూర్తి,

గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ అధ్యక్షులు

గుళ్ళపల్లి సుబ్బారావు గారికి...

Dr. N. Gopi, M.A. (Telugu), Ph.D.
Professor of Telugu (Retd.)
Emeritus Fellow
Former Vice-Chancellor, P.S. Telugu University
Former Dean, Faculty of Arts
Osmania University, Hyderabad.

(Accredited by NAAC with Five Stars)

Off : (040) 27682294
Res : (040) 27037585
Cell : 9391028496
Email: prof.ngopi@gmail.com

మనసు పొరల్లోంచి...

విశిష్టనానీల కవిగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారికి నేనివాళ కొత్తగా కితాబివ్వనక్కరలేదు. వచనకవితా సృజనలో కూడా ఆయనది ప్రత్యేకమైన గొంతు. స్వభావోక్తి రమ్యం ఆయన కవిత్వం, వాస్తవికత కూడా అందంగా వుంటుందన డానికి అది చక్కని ఉదాహరణ. అందమంటే అలంకారికత మాత్రమే కాదు. అంతర్ బహిర్ లోకాలను కలిపికుట్టే సూత్రం. ఆ సూత్రం పేర్లు ఆర్తి, ఆవేశం, భావుకత, వీటన్నింటి నైష్పత్తిక శక్తివల్ల కవిత్వం పఠిత హృదయాన్ని తాకుతుంది. అటువంటి కవిత్వమే ఈ సంపుటి నిండావుంది.

'మట్టిపొరల్లోంచి...' అంటే సోమేపల్లి విషయంలో గుండె పొరల్లోంచి అనే అర్థం. ఆయన అచ్చమైన రైతుబిడ్డ. ప్రభుత్వంలో ఎన్ని ఉన్నతోద్యోగాలు చేసినా మరకలంటని స్ఫటిక వ్యక్తిత్వం ఆయనది. ఈ కింది పంక్తులు దానికి తార్కాణం.

'నిత్యం
నేను నాలోకి ప్రవహిస్తుంటాను
నిశితంగా పరామర్శించుకుంటాను
మానవీయపు పలకరింపులు
మనోపేటికలో
జ్ఞాపకాలదొంతరలై
పరిమళిస్తూనే వుంటాయి'

సోమేపల్లికి రైతుల గోస తెలుసు. ప్రపంచీకరణ పర్యవసానాలు తెలుసు. ప్రభుత్వ భాష తెలుసు. మరీ ముఖ్యంగా ప్రజల భాష తెలుసు. అందుకే

'రైతు నిఘంటువులో
అన్నీ వున్నాయి...
పేగునింపే
గిట్టుబాటు ధర తప్ప'

అని అనగలిగిన సూనృతకవి. ఈ కవికి అక్షరాలు పోయి అంకెలే మిగుల్తాయని భయం. అక్షరాలు అంటే మానవత్వం. అంకెలు అంటే ఆర్థిక సంబంధాలు. ఆకలి వ్యథ నెరిగిన ఈ సుకుమార భావుకునికి బడుగురోదా తెలుసు. మార్కెట్ మాయాజాలం లోని రుణబాధ తెలిసిన సోమేపల్లికి చక్రవడ్డీ ఎంత నరకాన్ని సృష్టిస్తుందో అర్థమౌతుంది.

'చేనుదీ మనిషిదీ
గొప్పహరితానుబంధం'

అని అనగలిగిన ఈ కవి మనుషుల్ని గుండెనిండుగా ప్రేమిస్తాడు. ప్రేమ తత్త్వం లేనివాడు, మానవత్వం వెదజల్లని వాడు గొప్ప కవి కాలేడు. ఈ సంపుటిలో మనిషి పట్ల ఒక నమ్మకం, ఒక భరోసా, ఒక అనురాగం కనిపిస్తాయి.

ఒక మంచి మనిషిలోంచే మంచి కవిత్వం ఆవిర్భవిస్తుందనటానికి ఈ సంపుటిలోని ప్రతి కవితా నిదర్శనంగా నిలుస్తుంది.

సోమేపల్లి వారికి నా హృదయపూర్వక అభినందనలు...



గుండె లోతుల్లోంచి...

'మట్టి పొరల్లోంచి...' నా 7వ కవితా సంపుటి. ఇంతకు ముందు 'లోయలో మనిషి', 'తొలకరి చినుకులు', 'చల్ల కవ్వం', 'రెప్పల చప్పుడు', 'తదేకగీతం', 'పచ్చని వెన్నెల' సంపుటాలు వెలువడ్డాయి. వీటిలో 'తొలకరి చినుకులు', 'రెప్పల చప్పుడు', 'పచ్చని వెన్నెల' నానీల సంపుటాలు.

నా ఈ సాహితీ ప్రయాణంలో ఆశీస్సులు అందించిన, ప్రోత్సహించిన వారెందరో ఉన్నారు. అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. రసరాజు గారు, అద్దేపల్లి వారి పరిచయంతో కవిత్వం వ్రాయడం ప్రారంభించాను. వీరిద్దరి ప్రోత్సాహం మరువలేనిది.

ఈ 'మట్టి పొరల్లోంచి...' కవితా సంపుటికి ఆశీస్సులు అందించి ప్రోత్స హించిన ఆచార్య ఎన్. గోపి గారికి, నా తల్లిదండ్రులు శ్రీ సోమేపల్లి హనుమంత రావు, నాగరత్నం గార్ల నిరంతర స్మృతికి, నను గన్న మా ఊరు గన్నవరం (ప్రకాశం జిల్లా, యద్దనపూడి మండలం) గడ్డపై ప్రతి ఒక్కరికీ, మార్టూరు వెక్టా స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ సోమేపల్లి వెంకటేశ్వర్లు అన్నయ్యకీ హృదయపూర్వక ధన్యవాదాలు.

అర్ధాంగి విజయలక్ష్మి, అబ్బాయిలు శ్రీ విశిష్ట, శ్రీ విశ్వనాథ విరించికీ ఆత్మీయతా ఆశీస్సులు.

ముఖచిత్రం అందంగా రూపకల్పన చేసిన శ్రీ పి. వెంకటరెడ్డి (అబ్బు ఆర్ట్స్, చెన్నయ్) గారికి, శ్రద్ధగా డి.టి.పి. చేసిన పరాశరం పద్మకుమారి గారికి, ముచ్చటగా ముద్రించిన 'రత్న ప్రింటింగ్ వర్క్స్' వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

'మట్టి పొరల్లోంచి...' పుస్తక ప్రచురణకు ఆర్థిక, హార్దిక సౌజన్యం అందించిన 'గుళ్ళపల్లి సేవా సంస్థ' అధ్యక్షులు శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు గారికి ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేస్తున్నాను.

ఈ సంపుటిలోని కవితలను ప్రచురించిన వివిధ పత్రికల సంపాదకులకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

– సోమేపల్లి వెంకటసుబ్బయ్య

ఇందులో...

గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ

డోర్ నెం. 3-30-11/4, 2వ లైను, నలందా నగర్
గుంటూరు - 522 006
ఫోన్: 98491 43292

స్థాపన: సమాజ సేవయే లక్ష్యంగా 2010 సం॥లో

సంస్థ పరిచయము

సంస్థ నిర్వాహకులమైన మేము స్వర్గీయ గుళ్ళపల్లి బసవయ్య, శ్రీమతి లీలావతి గార్ల కుటుంబ సభ్యులము. మా అందరి శ్రేయోభిలాషి, మాలో ఒకరైన శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు కీ॥శే॥ బసవయ్య, లీలావతి గార్ల తృతీయ సంతానము. వారి పేరిట ఈ సేవా సంస్థ నెలకొల్పబడినది. మా అభిమానవ్యక్తి స్ఫూర్తితో ఈ సంస్థ కార్యక్రమాలు కొనసాగించుచున్నది. మాకు సలహాలు ఇచ్చి పురోభివృద్ధికి తోడ్పడే వారందరికీ మా ధన్యవాదములు తెలుపుకొనుచున్నాము.

సంస్థ ఆశయము

బీద విద్యార్థులకు, విద్యార్థినులకు వసతి కలుగజేయుటకై హాస్టల్స్, మానసిక వికలాంగుల సేవా సంస్థలకు, ప్రతి మానవుడు ఏదో ఒకరోజు చేరే మహాప్రస్థానాల అభివృద్ధికి, ప్రభుత్వ, నగరపాలక సంస్థ పాఠశాలల వసతులకు, వీటికి తోడు మా దృష్టికి వచ్చిన సమాజహిత కార్యక్రమాలను ఇతోధికముగా మా ఆర్థిక వనరులతో నిర్వహించుట.

పై ఆశయముల కొరకు సంస్థాపన నాటి నుండి గుంటూరు నగరములోనే గాక మా స్వగ్రామము బ్రాహ్మణకోడూరులో కూడా కార్యక్రమములకు పెద్ద మొత్తములో ఆర్థిక సహాయము చేయుట జరిగినది. భవిష్యత్తులో కూడా మా ఆశయ సాధన కొరకు పాటుపడదలచినాము.

విద్యాభివృద్ధికి దోహదపడిన వ్యక్తులను, సమాజ సేవాతత్పరులను, మానవత్వ విలువలు పెంచిన వారిని మా సంస్థ సగౌరవంగా సత్కరించి వారిని ప్రోత్సహించుచున్నది.

నాలో నేను

నిత్యం
నేను నాలోకి ప్రవహిస్తుంటాను
నిశితంగా పరామర్శించుకుంటాను
మానవీయపు పలకరింపులు
మనోపేటికలో
జ్ఞాపకాల దొంతరలై
పరిమళిస్తూంటాయి

అవాంఛిత రాగాలు రోగాలై శ్వాసించినా
నిశ్వాసమై విడిచిపెడుతుంటాను
మనసు మర కాదు
మమతల పొర...!

పాతికేళ్ళనాటి ప్రతిరూప చిత్రం
రంగుల కాగితంపై
కళ్ళముందు దర్శనమిస్తూనే వుంటుంది
ఛాయాచిత్రం మాయాచిత్రమై
మోసం చేయవచ్చేమోగాని
మనసెప్పుడూ మానవీయపు
మల్లెచెండే...

దశాబ్దాల ప్రయాణం
శరీరపు వన్నె తగ్గించిందేమోకాని
మనోశ్వాస
కొత్తచిగురై పల్లవిస్తూనే వుంది
నేను నిరంతరం
ప్రవహించే మనిషినే!



వెన్నెముక గోడు

కాడీ జోడెద్దులూ
నాగలీ గొర్రూ
జడ్డిగం
ఎరువులూ క్రిమిసంహారకాలు
చేనూ మంచే
వడిసెలా
కోతలూ నూర్పిళ్ళూ -

రైతు నిఘంటువులో
అన్నీ వున్నాయి....
పేగు నింపే
గిట్టుబాటు ధర తప్ప...!?

అంకెలు

ఎక్కడ చూసినా
అంకెలే దర్శనమిస్తాయి
ఇప్పుడు భాష మారిపోయింది
మాట బీటవారిపోయింది

నెత్తురు అణువణువూ
కార్పొరేట్ కల్చర్‌ను రంగరించుకుంది
పేరుకు బదులు
నెంబర్లతో పిలుచుకోవడం
ఫ్యాషన్ అయింది
డాలర్ గాలి
మనసు గదిలోకి జొరబడి
అప్పుడే పుట్టిన బిడ్డ కూడా
లంకెల బిందెలై దర్శనమిస్తోంది

అక్షరాల ఆచూకి గగనకుసుమమై
అచ్చం
అంకెలే మిగులుతాయేమోనని
కించిత్ భయం

క్రమేపీ
ఓ దిగులు ఆవహిస్తోంది
తెల్లారి లేచింది మొదలు
నిద్రమత్తులోనూ
అంకెల ఆరాటమే
అంకెలే లేకుంటే
బతుకు తెల్లారిపోతుందేమో...!?



మాటల బేహారి

గుప్పెడు గింజలు
చేతిలోకి తీసుకుంటే చాలు
క్షణాల్లో
నాణ్యతా ప్రమాణాలు
నిర్ణయమైపోతాయట....!?

కూలీకాదు
చెమట చిందించడానికి...
రైతూ కాదు
తలపాగా చుట్టడానికి!

వంటిమీద బట్టలు నలగని
మాటల బేహారి
నేల లేకుండానే
అధిక దిగుబడులు 'దండు'కునే
మాంత్రికుడు

ధర ఎంత పలుకుతుందోనని
బక్కచిక్కిన రైతు గుండె
కొట్టుమిట్టాడుతూంటుంది
భూతద్దం ఆదర్శమేమో
క్షణాలమీద
లోపాల్నీ సుగుణాల్నీ సృష్టించి
ధరల నిర్ణాయక సంఘాల్నీ
నాణ్యతా ప్రమాణాల సంస్థల్నీ
నివ్వెర పరుస్తుంటాడు

అన్నదాతల అవసరాలే
పెట్టుబడీ మూలధనమూ
బడా వ్యాపారులకు
బాకా వూదుతూ
అన్నదాతకీ
వాణిజ్య విహారికీ మధ్య
రాయ'భార' మౌతుంటాడు

అతడు
అనుసంధాత కాదు
అన్నదాత అడుగుల్ని
శాసించే విధాత !

సుడిగుండం చుట్టూ...

ఆటాపాటా అక్కడే
తోడూ నీడా అక్కడే
కట్టుకున్నదాని పేరు
గుర్తుంటుందో లేదో కాని
మెతుకుముద్దలు తినిపించే
జలపుష్పాల జాబితా
నాలుక చివర్న నానుతూనే వుంటుంది

గంగమ్మ తల్లికి
పసుపు ముద్దలతో మొక్కి
వంగివంగి గుడిసెలోంచి
బయటకు వచ్చి
ఆశల పడవలో అడుగు పెట్టడం
దినచర్య

అలలు వలను ఆదుకుంటాయా...?
వల 'కల' పండుతుందా...?
నమ్ముకున్న జలం
ఉప్పూ పులుసు అందించడమే కాదు
ఆగ్రహం వస్తే
ఆకల్నీ ఆవాసాల్నీ ఏకంచేస్తుంది
ఎగిసిపడే అలలకు
ఎదురొడ్డే ఆశలవేట
పండుగొప్పా సందువా
పడిందంటే
ఆ రోజుకి పండగే

చిన్నా చితకా చిక్కుకుంటే
పొట్ట నిండడమే అస్తూబిస్తూ
ఇక్కడ నడియేట్లో
ఆశల వల విసిరి అబగా చూస్తుంటే
బుడతలు తీరం వెం'బడి'
ఉప్పూకారంతో సిద్ధమై
అంగలారుస్తుంటారు

ఇది పొట్ట కోసం పడే ఆరాటం
ఆటూ పోటూతో చెలగాటం
వేళాపాళా లేని తిండీ
ఉప్పు గాలుల హోరూ
బతుకంతా నిత్యం నీటిలోనే
అకాల వృద్ధాప్యం విసిరిన వలలో
చిక్కుకుపోయినా
కష్టాల సునామీని తట్టుకునే
నిలబడతారు
వాళ్ళ జీవన నౌక మాత్రం
చిక్కుల సుడిగుండం చుట్టూ
పల్టీలు కొడుతూనే వుంటుంది

మళ్ళీ అమ్మ ఒళ్ళోకి...

ఇక్కడ
వెలిగించిన ప్రతి జ్యోతీ
ఎన్నెన్ని దీపాలకు
వూపిర్లూదింది...

కళ్ళకద్దుకున్న మట్టి పరిమళం
పల్లె పొలాల్లో
హరిత విప్లవమై పల్లవిస్తోంది
రెక్కలు విచ్చుకున్న
విహంగం
ప్రపంచ పటమంతా
విజ్ఞానమై విహరిస్తోంది
విరబూసిన సుమం
ఎల్లల రేఖలు దాటి
సుపరిపాలనా సౌరభమవుతోంది

అర లాగు అర చొక్కా
'ఫ్యాంటూ షర్టు'గా
రూపాంతరం చెందింది మొదలు
పట్టా పత్రం స్వీకరించేదాకా
ఎన్నెన్ని అనుభూతులు...
ఎన్ని అనుభవాలు...

ఈ నేల
ప్రతి అంగుళమూ
పాదాలకే కాదు
మనసు పొరలకూ చిరపరిచితమే

ఎన్ని కేరింతలు...
ఎన్నెన్ని తుళ్ళింతలు
కుర్రకారంటేనే
అనేక లక్షణాల సమ్మిళితం కదా...!

క్లాసులు ఎగ్గొట్టి
మ్యాట్నీ షోకి తయారయ్యేలా
బెల్‌బాటమ్స్ గుంపు ఒక వైపు
అమ్మాయిలకు సైటు కొట్టే
షోకుల షోకిల్లాలు మరో వైపు
లైబ్రరీ దగ్గరా, మేష్టార్ల దగ్గరా
విధేయతతో తచ్చాడే
పుస్తకాల పురుగులు ఇంకో వైపు

జ్ఞాపకాల అలలు
తలపుకొస్తే చాలు
వయసు వేగంగా వెనక్కి పరుగులెత్తి
కళాశాల ముంగిట్లో వాలుతుంది

పసి (డి) ప్రపంచం

పిల్లలే పిల్లలు
బళ్ళో... బజార్లో... ఇంట్లో...
జీవకళంతా వాళ్ళవల్లే

ఇప్పుడంటే
లెక్కప్రకారం పిల్లల్ని కనడమూ
రెక్కలు కట్టుకొని
పట్నానికి ఎగిరి పోవడమూ
అసలు మా వూరు ముద్దుపేరే
పిల్లల గన్నారం కదా...!

అమ్మానాన్నలకి బురిడీ కొట్టి
కాకేడు కుంటలో
ఈతకొట్టే జతగాళ్ళు
చిల్లతనానికి అచ్చుగుద్దిన
ప్రతిబింబాలే...

కోతి కొమ్మచ్చీ బచ్చాలాటా
బిళ్ళంగోడూ ఉప్పాటా
కేరింతల హోరు చూస్తే
వీళ్ళకి
తోక ఒక్కటే తక్కువేమో
అనిపించేది...

ఇప్పుడో...!
మా పల్లె ఓ వృద్ధజనాశ్రమం
నిస్తేజపు నిలయం

మూడు కాళ్ళతో అత్తిపత్తిలా
అడుగులేస్తూ
జవం జీవం పోసేవాళ్ళ కోసం
పొలిమేరల్లో
ఆబగా ఎదురుచూస్తూ
కళతప్పి
జీవచ్ఛవంలా సొమ్మసిల్లింది...

అయినా
నా గుండె పొరల్లో
చిన్నప్పటి పల్లె చిత్రం...
నేటికీ నిక్షిప్తమే...

ఆ నేల నిండా...

కన్నీరు -
కట్టలు తెంచుకున్నా
రెప్పల ఆనకట్ట దాటదు
గుండెల్ని పిండే దృశ్యాల్ని
ఏకరువు పెడుతుంది

ఆకలి వ్యథా
బడుగుల రొదా
ఆడపడుచుల వేదనా
దాష్టీకపు ఇనుప వలా...
ఎన్ని కథలో
ఎన్ని కన్నీళ్ళో

నిత్యం
ఆ నేల నిండా...
పర్వాలూ అధ్యాయాలూ
అవసరం కానేకాదు
దిగులుతో కొందరు
దివాలాతనంతో ఇంకొందరు
అధికారుల
ఆశావహ ఆపన్నహస్తం కోసం
నిరీక్షస్తూ... నివేదిస్తూ...

గతుకుల బతుకుల బండిపై
ఒడిదుడుకుల సవారీచేస్తూ
కాగితాల కట్టడాలతో
నిలువు కాళ్ళతో నీరసించే వాళ్ళే

ఒక్క కాగితం ముక్క చాలదూ
అసలు
ఆలకించే నాధుడంటూ
వుండాలే గాని...!?

జిందగి

క్యాష్
అండ్
క్యారీ

యూజ్
అండ్
త్రో

డాలర్ యవనిక

విత్తునాటకుండానే
నీళ్ళు పొయ్యకుండానే
చెట్టు ఎదగాలి
పూత లేకుండానే
పిందె కావాలి

అంతా కాలం మహిమేనా
డాలర్ మహత్యం కూడా...
హృదయ కవాటానికి
వాణిజ్యపు యవనిక
చీకటి ముసుగై చుట్టుకుంది

రెండు దేశాలూ...
రెండు గ్రామాలూ...
ఇద్దరు మనుషులూ...
'హార్థిక' దీపం
ఆరిపోతోందన్న
ఆలోచన లేనేలేదు
బుర్రలో అస్సలు ఖాళీ లేదు
నిండా ఆర్థిక గణాంకాలే...!?!



భాషే నా శ్వాస

‘పేగు’భాషతో
మౌనపర్వతాన్ని
బద్దలుకొట్టి
పెనవేసుకోవాలి

మాట–
మట్టివాసనల్ని కోల్పోతోంది
భాష–
బండరాయి కింద నలిగిపోతోంది
‘అమ్మా’ అని
పిలవడానికీ ఆత్మవంచనే
ముఖానికి రంగులద్దినట్టు
అక్షరాలకీ షోకులల్లుతూ
ఒత్తులూ పొల్లులూ వచ్చినా
వత్తివత్తి మాట్లాడుతుంటే
తెలుగు మొక్కకి
తెగులే సోకుతుంది

ఆధునికత
మహామ్ముసుర్రై
భాషా వృక్షాన్ని కూల్చేస్తుంది
‘ఘన చరిత్ర’
తెలుగు గుండె తలపులు మీటితేనే
మాట–
మట్టి వాసనతో ప్రభవిస్తుంది
భాష–
జీవకళతో విలసిల్లుతుంది

లేకుంటే
అచ్చమైన అమ్మ భాష కోసం
చూపులు
ఇక చక్కని చుక్కానీ కోసం
వెతుక్కోవాల్సిందే

సూక్ష్మ 'వ్రణం'

రంగుల వలలో చిక్కితే
అంతే సంగతులు
చుట్టూతా జలగలు
నక్కినక్కి రక్కిరక్కి
పీల్చిపిప్పి చేయటానికి
ఆవురావురుమంటూంటాయి

ఆకర్షణీయమైన పేర్లతో
మార్కెట్ మాయాజాలంలోకి
ప్రవహించి
ఆప్యాయత కుమ్మరిస్తూ
పిడికెడు రుణాన్ని విదిలిస్తుంది

ఇది సూక్ష్మంలో మోక్షం కాదు
సూక్ష్మ రుణ మోసం
మహావ్రణ మాయాజాలం
పుస్తెలూ, కాలిమెట్టెలూ
ఇంట్లో సామాగ్రి
వీటితోనే ఆగిపోదు
ఆరోగ్యాన్నీ ప్రాణాన్నీ
పల్లేరుకాయపై దొర్లిస్తుంది
చిటికెడు రుణం
చేటంత బతుకుని
చక్రవడ్డీ బంధంలో చిరిగేస్తుంది
అప్పు తీర్చటానికీ
మళ్ళీ మళ్ళీ రుణగ్రస్తుల్ని చేస్తుంది

ఇల్లాలి బతుకులో
చాపకింద నీరులా చొరబడి
శారీరక మానసిక శాంతిని నాన్చేస్తుంది
'సూక్ష్మం'
ఓ రంగుల భ్రమ
నిండు జీవితానికి చెరుపుచేసే
కసాయికళ
దాష్టీకపు చేష్టలకి
ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాఫ్ పెట్టకపోతే
మరణమే దాని వెల....!

మళ్ళీ బతికేందుకు...

మామూలుగా అయితే
వూపిరి పోయిన మనిషి
వూరూ పేరూ లేకుండా
మట్టిలో కలిసిపోవాల్సిందే

బ్రెయిన్ డెత్...
ఒక దీపం
మరో జ్యోతిని వెలిగిస్తుంది
కాస్త చమురు
కొత్త వెలుగుకు
వూపిర్లూదుతుంది
కాలి బూడిద కాకుండా
మరొకరికి అమరిస్తే
కళ్ళు కోటి కాంతులిస్తాయి

కాలేయం కాపాడి
వేరొకరి శరీరంలో భద్రపరిస్తే
విషానికి విరుగుడవుతుంది
మనిషికి మనసుతోడైతే
విశ్వం విశాలమవుతుంది
దురదృష్టం
వెన్నంటినప్పుడు
వూపిరి ఓ దేహాన్ని వీడుతుంటే
అయిన వాళ్ళందరూ
దుఃఖసాగరంలో మునుగుతారు

ఆ దుఃఖం నుంచి
త్యాగం పుడితే...
కొడిగట్టిన ఆ దీపం
ఐదారు జీవితాల్లో
వెలుగు ప్రసరింపజేస్తుంది

ఒక మణికంఠ
ఏడుకొండలూ
సురేష్‌లే కాదు
అవయవదానం చేసిన వారందరూ
చిరంజీవులే
ఆ కుటుంబాలు త్యాగానికి ప్రతీకలే
జీవన్ దాన్..
మహా దాన్..

దృక్పథం

శ్రమ
నరాల సత్తువై
జీవన చక్రానికి
ఇంధనమిస్తుంది
నెత్తురు
శక్తినిస్తే
మట్టి
మార్గదర్శకమవుతుంది

ఎండైనా వానైనా
పగలైనా రాత్రైనా
కరువు కాటకమైనా
కష్టకాలమైనా
గుండె దిటవుకు
ఔషధమయ్యేది శ్రమే

శ్రమంటే చిట్టి చీమలదేకదా
శక్తికి మించిన భారం మోస్తూ
క్రమశిక్షణకు మారుపేరై నడుస్తాయి
అందుకే అవి మనకు ఆదర్శం

శ్రమ నా వారసత్వం
శ్రమ నాకు ఆదర్శం
శ్రమ నా విశ్వాసం
శ్రమే జీవన సౌందర్యం
నాలో పొంగేది
రక్తకాసారం మాత్రమే కాదు
స్వేద సముద్రం కూడా



పాదు నీడ

మట్టిదీ చెట్టుదీ
చెట్టుదీ చినుకుదీ
చినుకుదీ చేనుదీ
చేనుదీ మనిషిదీ
గొప్ప హరితానుబంధం

మట్టి నా ప్రాణం
చెట్టు నా శ్వాస
పురిటి బిడ్డను సాకినట్టే
మొక్కల మొదళ్ళను
రోజూ పరామర్శించి
ఆత్మీయతా సౌరభం
ఆస్వాదిస్తాను
స్వేదం జలధారగా మారి
వేర్లకు ఊపిరి అందిస్తుంది
పెరిగి పెరిగి... విరిగి కూడా
మానవ అనుబంధాలకు
మార్గదర్శి అవుతుంది

కుటుంబమంటే
అమ్మానాన్న పిల్లాజెల్లాయేకాదు
గొడ్డూ గోదా చెట్టూ పుట్టా పిట్టా కూడా...
ఇల్లంటే కేవలం
ఇటుకల గోడల సమూహమే కాదు
ఊరంటే కేవలం
కొన్ని ఇళ్ళ గుంపు మాత్రమే కాదు

పల్లె పొలిమేరల్ని పరవశింపచేసే
కొండాకోనా వాగూవంకా చెట్టూచేమా

ఎడం ఎడంగా నాటిన మొక్కలు
ఏపుగా పెరిగి పెరిగి వృక్షాలై
కొమ్మలై రెమ్మలై కౌగిలించుకుంటాయి

తల్లీ బిడ్డల నడుమేమో
వయసు పెరిగే కొద్దీ
మమతల అల్లిక మృగ్యమౌతోంది

ప్రకృతి గాలిపీలిస్తేనే
పరిసరంతో సహజానుబంధం
పల్లవించేది
చెట్టు చిగురిస్తేనే
చెలిమితో సహజీవానుబంధం
మొలకెత్తేది

ఇంటికి బదులు
ఇంద్ర భవనమిచ్చినా
చెట్ల పాదులే
మనల్ని చిరంజీవుల్ని చేసేది...!



గుప్పెడు బంగారం

ఇప్పుడు
ఆ బుల్లి ఇంజనీర్లు ఏమైపోయారో...!
అద్భుతంగా నిర్మించిన
ఇళ్ళ ఆనవాళ్ళు కనపడవేం-

తూరుపు ఎండపొడతోపాటే
కిచకిచలు పలకరింపులై
వెలిగిపోతుండేవి
చూరుకు వేళాడే
జొన్నకంకుల్ని ముక్కుతో పొడుస్తూ
సవసవల సందడి
ధాన్యం గింజల్ని చేటతో చెరిగే
అమ్మ చుట్టూతా చేరి
రెపరెపలాడేవి

చెట్టు కొమ్మలూ ఇంటి చూరులూ
దిష్టిబొమ్మల్లా వెలవెలబోతున్నాయి
రేడియేషన్ కిరణాలు
పిట్టల గుండెల్లో
తుపాకీ తూటాలై పేలుతున్నాయి

అంతా మౌనసంక్షోభమే
మూగబోయిన పలుకు
సెల్‌ఫోన్ రింగ్‌టోన్‌గా ధ్వనిస్తోంది
చిన్ననాటి జ్ఞాపకాలను
చేటల్తో చెరిగిపోసిన అమ్మ

కనిపించని దూరాలకెళ్ళినా
కళ్ళ ముందు కదలాడుతూనే వుంది

అమ్మ చుట్టూ చేరి
చేటమీద ఆటలాడిన బుల్లిపిట్ట
అదృశ్యమైపోయిందా...?

గుప్పెడంత బంగారు బుల్లికొండ
ఇప్పటికీ నా గుండె నిండా...



ఉట్టి

చల్లని కుండలో
ప్రేమాభిమానాలను కలగలుపుకునేది
తోడుకున్న పెరుగన్నం
తెల్లారుతూనే
ఉట్టిలోంచి కిందకు దిగి
అచ్చం అమ్మలాగే
ప్రేమామృతాన్ని పంచియిచ్చేది
ఉట్టి వున్న ఇల్లు
పాడిపంటలకు పచ్చని నిలయమని
చాటిచెప్పేది

ఐదారు తాళ్ళతో
కుండ బరువును మోసే ఉట్టి
ఐకమత్యానికి ఓ సూచికే...
కాలుష్యపు మసి పట్టని ఉట్టి
నేల విడిచి సాముచేసే
'వీరు'లపై
హెచ్చరికల బాణం సంధించి
నియంత్రణ చేసేది

ఏడాదికోసారి వచ్చే
ఉట్టిపండగ
పల్లె ప్రాంతాలకూ పోటీస్ఫూర్తికీ
అక్షరాలా ఓ వరం
ఉట్టి వొట్టి పోకూడదు
కుండ వోడు పోకూడదు

ఇప్పుడు–
చరిత్ర కర్కశ చక్రాల కింద
నలిగి నుజ్జయిన
ఓ అవశేషం
ఉట్టి...!!

మనిషికి అందకుండా
వేలాడుతూండే
ఉట్టి
ప్రేమాభిమానాలకు
ఎప్పుడూ ప్రతీకే...

ఎక్కడని వెదకడం...?

కలివిడితనం
ఇప్పుడు
ఒక అపురూప దృశ్యం
ఎక్కడని వెదకడం....?

పల్లెపటం నిండా
బస్తీ చమ్కీ తళుక్కులు
ఆత్మీయుల మాటలకి కూడా
అర్థాల కోసం
వాణిజ్య పదకోశం వెతుక్కోవాల్సిందే
గూటిలో గువ్వలు
పలుకులు పంచుకోవు

ఫేస్‌బుక్ సాక్షిగా–
ముక్కూ మొహం తెలియకపోయినా
తెల్లవార్లూ చాటింగ్
ఇది మనసు ప్రపంచం కాదు
వంచన పంచన బతుకుతున్న
ఆత్మీయత, అనుబంధాల
రంగులు పులుముతారు

బతుకు బాటకి
బడి సిలబస్‌కి
పొంతన వుండదు
చదువుల ధ్యాసంతా
కాసులపైనే

వావి వరుసలు మరచిన
సంస్కారం
సంచారమృగమై
పంజా విసురుతోంది

సందేహం-
అసలు
మనిషి సంఘజీవేనా....!
ఏకాకితనం
మనిషి నిర్వచనాన్ని
మార్చివేసిందా....!?

అయితే ఇప్పుడు
మనిషిని వెతకాలి
బయటకాదు
మనిషిలోనే వెతకాలి

చప్పిడి బతుకు

కాళ్ళని రోకళ్ళుగా చేసి
కసాబిసా తొక్కేకొద్దీ
తెల్ల బంగారమై
మెరుస్తుందన్న నమ్మిక...!

నీటి ఉప్పుదనంపై
చెమట చేవ్రాలు చేసి
'కొఠారు'ల్లో
కొలువుతీరుతుంది
ఆవలి తీరం గురించి కాదు
జీవన పోరాటంపైనే
నిత్యం ఆలోచన

అచ్చం దూరపు కొండల్లాగే
అల్లంత దూరాన్నుంచే
తెల్లని రాసులు
కళ్ళముందు మెరుస్తుంటాయి

నీళ్ళకి నీళ్ళే శత్రువేమో....!
అకాల వర్షమైనా
ఉవ్వెత్తు ఉప్పెనైనా
బతుకు నావ పల్టీ కొట్టి
పంట కన్నీటి మంట పెడుతుంది
తూనికలకూ కొలతలకూ
ఆమడ దూరంలో వుంటూ
అక్రమ వడ్డీల దుడ్డుకర్ర దెబ్బలు
భారంగా భరిస్తూంటుంది

ఉప్పుమడికీ బతుకుబడికీ
దళారులే
అనుసంధానం అవుతూంటే
బతుకంతా ఇక చప్పిడి
మెతుకులే...!?

గుండె తడి

ముక్కు పచ్చలారకముందే
మూతి తుడుచుకోవడం
తెలియకముందే
బాల్యం
కాన్వెంట్‌కి
బందీ అవుతోంది

ఆటా పాటా... కంప్యూటర్‌తోనే
టకటకలాడిస్తూ బూట్లూ
ఖరీదైన యూనిఫాం
కళ్ళకి ఓ జోడూ ప్రత్యక్షం

అమ్మా నాన్నా తప్ప
అందరూ... ఆంటీ అంకుల్స్
మార్కుల కోసం ఆరాటమే కాని
మార్పు కోసం కానే కాదు
ర్యాంకుల కోసం
బాల్యపు మధురానుభూతులకు
మంగళం

ఆకాశాన్ని అందుకునే
మార్కులొచ్చినా
చదవడం, రాయడం పూర్తిగా రాదు
ఇంటర్లో మార్కులకీ
ఎంసెట్ ర్యాంకులకీ
పొంతనే ఉండదు

రంగురంగుల పోస్టర్లలో
ర్యాంకర్లు
గోడలపై ప్రత్యక్షమవుతూంటే
'చదువు' స్వదేశం కోసం కాదనే
భావం బలపడుతుంది

అభివృద్ధి అంటే
డాలర్లు దండుకోవడమేననుకుంటారు
పిరికిదనపు పెంపకాన్ని
మార్కులు వెక్కిరిస్తూంటే
'పసితనం'
స్థైర్యం కోల్పోతుంది

ఈ చదువులకి
హృదయపు తడి కావాలి
ఈ ఆరాటానికి
వినయమూ, విలువలూ
జత కలవాలి....!?

మానవత్వపు పతాక

కోల్పోయిన తనానికి
కోరికలు కూడా
పరిమితంగా వుంటాయేమో...

కళ్ళు లేని కబోది
చూపు వస్తే చాలు
ప్రపంచాన్ని కళ్ళకద్దుకుంటానంటాడు
గొంతు లేనివాడు
మాట్లాడగలిగితే
మరో కోరికే కోరనంటాడు
నడవలేని వ్యక్తి
కాళ్ళొస్తే
ఈ జన్మకిది చాలనుకుంటాడు

అన్ని అవయవాలూ
సక్రమంగా వున్నాయనుకుంటే...
ఆశ స్వార్థం రెక్కలు తొడుక్కొని
ఆకాశమే హద్దుగా విహరిస్తుంది
ఒకటి తీరగానే మరొకటి
పుట్టగొడుగుల్లా
కోర్కెలు పుట్టుకొస్తుంటాయి
శిఖరానికి ఎగబాకాలనుకోవటంలో
తప్పు లేదు
స్వార్థపురాళ్ళు నెత్తికెత్తుకొని
ఆదర్శపు ఆనవాళ్ళు
చెరిపేసుకుంటూ కాదుగా...

శిఖరాన్ని
అధిరోహించిన వ్యక్తి
అక్కడ
మానవత్వపు పతాక ప్రతిష్టించి
జేగంటలు మోగించాలి

దాహం బాబోయ్... దాహం

బిందువే కదాని సరిపెట్టుకుంటే
సింధువు కలే
జలమే కదాని జాగు చేస్తే
నీళ్ళకు నీళ్ళొదులుకోవాల్సిందే...

ఎర్రటి అగ్గిలో
రోళ్ళు పగిలే ఎండలో
కాళ్ళ బొబ్బలతో... నడినెత్తి మాడుతూ
క్రోసెడు దూరం నడిచి
కడవ మోసుకొస్తే
అందులో మిగిలేది కన్నీళ్ళే...!

చుట్టూతా నీళ్ళున్నా
గొంతు తడవని దైన్యం
కంపుకొట్టే ఆ నీళ్ళే
అనారోగ్యానికి ఆహారం
వాన నీళ్ళు వొడిసిపట్టే ధ్యాస లేదు
ఇంకుడు గుంతకింత జాగానే వుండదు

దట్టమైన చెట్టును కొట్టేసి
హరితాన్ని హత్యచేస్తూ
పండంటి నీడను
ఎండగడుతున్నాం

ఎదురుగా నీళ్ళ సీసా...
అయినా
నాలుక పిడచ కడుతూనే వుంది
గొంతు ఎండిపోతూనే వుంది

ఒక భయానక దృశ్యం
నన్ను వణికిస్తోంది
ఎటు చూసినా
దాహం కేకలు...
జలమే కదా జీవం
ఇప్పుడు
జనం జపించాల్సిన మంత్రం ఒక్కటే
జలం... జలం... జలం...



ఫేస్‌బుక్ లో 'అమ్మ'

అతని నాలుకపై
'హైటెక్' చాక్లెట్
నానుతూనే వుంటుంది

మెదడులో డిజిటల్ 'టెర్మినాలజి'
గిర్రున తిరుగుతూనే వుంటుంది
గూగుల్ సెర్చ్‌తో
దినచర్య మొదలౌతుంది
హార్డ్‌వేర్‌తో ఆటలు
సాఫ్ట్‌వేర్‌తో సయ్యాటలు
ట్విట్టర్‌తో ట్విస్టులు...

ఒకానొక సాయంత్రం
ఆకస్మికంగా–
అతని తల్లి మరణించింది
వెంటనే
ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేసి
లైక్‌ల కోసం
కామెంట్ల కోసం
షేర్‌ల కోసం
నిరీక్షణే... నిరీక్షణ...



జలో రక్షతి రక్షితః

ఆ రోజుల్లో....
గుక్కెడు నీళ్ళు గొంతులో పోసుకుని
గుండె ఆరాటం తీర్చుకునేవాళ్ళం
పొలాల్లో చెమటోడ్చి
కుండల్లో నీళ్ళు
గట గటా తాగేవాళ్ళం...

ఇసుక తిన్నెల్లో
చెలమలు తీసి
జలసిరిని అరచేతిలోకి తీసుకొని
గుటకలు గుటకలు మింగేవాళ్ళం
నదిలో నీళ్ళు
కళ్ళకద్దుకొని
కడుపారా సేవించేవాళ్ళం
ఎండన బడి వచ్చిన వాళ్ళకీ
పొరుగూరోళ్ళకీ
కుండల్లోంచి చల్లని నీళ్ళిచ్చి
సేద తీర్చేవాళ్ళం

ఇప్పుడు-
నది పక్కనే వున్నా
నీళ్ళు ముట్టలేక పోతున్నాం...
ఒక్క గుక్క తాగామా
లెక్కలేనన్ని జబ్బులు
ఊరు చుట్టూ నీళ్ళున్నా
వుసూరుమనే వాళ్ళక్కూడా
ఉద్ధరిణి నీళ్ళివ్వలేం

మనిషి జీవితంలో
వాటర్ బాటిల్
ఓ భాగమైపోయింది
అంతటా ఒకటే మంత్రం
వాటర్ బాటిల్... వాటర్ బాటిల్...
నీళ్ళ సీసా మీద ఎంతనమ్మకం...!?
కుళాయినీళ్ళకి బిరడా బిగిస్తే
స్వచ్ఛమైన నీటి సీసా అవుతుందా...?
బోరింగ్ నీరు
బాటిల్‌కి చేరగానే
పరమ పవిత్రమవుతుందా...

ఖర్చు పెట్టిన కరెన్సీ
కన్నీళ్ళు తెప్పిస్తుంది
బ్రాండ్ నేమ్‌లతో మురిసిపోతే
బ్యాండ్ పడుతుందేమో!
బాధ్యులం మనమే

గాలిలాగా
ఇప్పుడు నీరూ వాణిజ్య వస్తువయింది
నీరు తాగాలన్నా, గాలి పీల్చాలన్నా భయం
ఇక మిగిలింది
వాటర్‌బాటిల్స్ లాగా
ఆక్సిజన్ బాటిల్స్ రావడమే...!

లింకుల కర్ర

నిలువెత్తు మనిషి కంటే
బారుగా వుండి
ఇంట్లో ఓ మూలన
ఏటవాలుగా
గోడకానించి వుండేది

చేలల్లోకి వచ్చిందంటే చాలు
సరిహద్దు తగాదాలు
ఇట్టే సమసిపోయేవి
చేను విస్తీర్ణపు తేడాలు
చిటికలో సరిచేసేది

పదిలింకుల కర్ర-
పదిమంది రైతుల్ని పోగుజేసి
సమస్యని మాయం చేసి
సామరస్యాన్ని కుదిర్చేది

ఊరి మొత్తం మీద
లింకుల కర్ర
మా ఒక్క యింట్లోనే వుండడం
మాకు గర్వంగా వుండేది
లింకుల కర్రకోసం వచ్చే రైతుల
పలకరింపులు
ప్రేమాభిమానాలు చిలకరించేవి

నాలుగు దిక్కులూ కొలతలేసి
ఓ కాగితం మీద రాసుకొస్తే
ఆ విస్తీర్ణపు లెక్కలు

క్షణాల్లో
నాన్న తేల్చేసేవాడు
లెక్కల చిక్కుల ముడులు విప్పి
రైతులకు సర్దిచెప్పే నాన్నలో
ఓ న్యాయమూర్తి కన్పించేవాడు

కొలతలు కొలిచీ కొలిచీ
వయసు మీద బడి
కొలతల కర్ర పెళుసుబారింది
విరిగిపోతే కట్టుకట్టి
దానికి మళ్ళీ జీవం పోసిన నాన్నలో
ఓ వైద్యుడు కన్పించేవాడు

కొత్తకొత్త
మెషీన్లు వచ్చినా
సాంకేతిక నిపుణులు వచ్చినా
ఇప్పటికీ పొలం తగాదాలు అలాగే వున్నాయి
లింకుల కర్రపైనే విశ్వాసం

లింకుల కర్ర
ఒక జ్ఞాపకం
నాన్న వున్నన్నాళ్ళూ
ఇంట్లోనే వున్న లింకులకర్ర
ఇప్పుడు అటకెక్కింది
అయినా
నాన్న జ్ఞాపకాల్లో వున్నన్నాళ్ళూ
లింకుల కర్ర
నా మదిలో మెదులుతూనే వుంటుంది



దిగులు గూడు

వచ్చే పోయే జనం
ప్రేమాభిమానమై ప్రవహిస్తూంటే
వొళ్ళంతా
పులకరించిపోయేది
ఇంటి 'కంటి' రెప్ప
పిల్లాజెల్లా ముసలీ ముతకా
అందరికీ
ఆత్మీయ ఛత్రమయ్యేది

కుండపోత వానైనా
రోళ్ళుపగిలే ఎండయినా
ఇంటిద్వార'బంధం' ముందు
తలవంచుకొని వెళ్ళాల్సిందే
నిత్యం
కేరింతల పచ్చని పండుగ
అందరి గుండెల్లో సందడి చేసేది

అవును -
ఇప్పుడు యిల్లు ఒంటరిది
పలకరించే నాధుడే కరువు
గొంతు చించుకుని అరిచిందేమో
గోడలు బీటలు వారాయి
సున్నంతో
తర తరాల స్వేదం
నీళ్ళుగా మార్చి ఇటుకల్ని అతికిస్తే
అవి ఇప్పుడు విడిపోతున్నాయి
ఆధునిక అనుబంధాల సెగ

తగిలిందేమో
గోడలు నెర్రెలుగా
విచ్చుకుంటున్నాయి
ఇప్పుడు ఇల్లు
దిగులు కూడు తింటోంది

రెక్కలు వచ్చి
గూడు వదలిన గువ్వలు
పొట్ట చేతపట్టుకొని
పట్నం వలస దారి పట్టాయి
రెక్కలు అమర్చుకొని
డొక్కలు నింపుకోవడానికి
ఎగిరిపోయిన విహంగాలు
దిగులు కళ్ళతో ఒకటే
ఎదురుచూపులు
ఆరుగాలం చెమటోడ్చి
ఆరు ఋతువుల్లో
అహరహం
హైరానా పడుతూ
ఆపసోపాలకు ఆలంబనైన
ఇల్లు చూశాక తెలిసింది
నిండా రక్త చారికలు
గొడ్డు చాకిరీ మరకలు
ఇప్పటి అసలైన విషాదం ఒక్కటే

ఊపిరిపోసుకున్న ఇంట్లోకి
ఊపిరి పోయాక చేరుకోవడం

ఇక ఇంటివి
గొప్ప దిగులు చూపులే కదా!



రామయ్య పంతులు బడి

గోడమీద రాత
సర్కారు బడిదయినా
జనం నాలుకపై నానేది మాత్రం
రామయ్య పంతులు బడే...

ఆ బళ్ళో పనిచేసిన పంతులుగారు
గుండె గుండెలో
ఆకుపచ్చని జెండా

ఆ ఆవరణలో
ఓ పూరిగుడిసె మరోపక్క చింతచెట్టునీడా
ఎన్నెన్ని శిఖరాలకు పునాదివేసాయో
తరాలు మారుతున్నా
గుడిసె భవనంగా రూపాంతరం చెందినా
ఆధునికం అందలమెక్కినా
పంతులుగారు
నల్లబల్లపై
ఎప్పటికీ చెరగని సుద్దముక్క చేవ్రాత

సాదాసీదా పంచెకట్టూ
నిండైన తలపాగా
తెలుగుదనానికి ఆయన చిరునామా
డుమ్మాకొట్టే పిల్లజనం కోసం
గుడిసె గుడిసెకూ
గొడుగుపట్టుకు తిరిగి
టెంకి జెల్లలు ఇచ్చే పంతులు గారంటే
అందరికీ భయమూ, భక్తీ

భౌతికంగా దూరమయినా
ఆయన భట్టీయం కొట్టించిన ఎక్కాలు
ఎప్పటికీ 'లెక్క' తప్పవు
శతకపద్యాలు పెదాలపై ప్రవహిస్తూ
బతుకు బాటకి
వెలుగు చూపుతూనే వుంటాయి

ఎన్నాళ్ళయినా ఎన్నేళ్ళయినా
ఊరుగుండెలో పచ్చని జ్ఞాపకం
రామయ్య పంతులు బడి
ఆ బడి చరిత్ర
నిరంతర చైతన్య దృశ్యకావ్యం

ఆకలి మట్టీ

బంక మట్టీ బూడిద నుసీ
కలగాపులగం
పేగుతడిపేదీ బతుకు నడిపేదీ
ఆ మట్టే

సుద్దలు సుద్దలుగా
కసాబిసా కాళ్ళతో నలగదొక్కి
చెమట చిందిస్తేనే
పిల్లాజెల్లకి కూడూ గుడ్డా
మట్టిముద్ద చేతుల్లో పిసికి
చెమటచుక్కలతో కలిసి
దీర్ఘఘనాకారపు
బిళ్ళతయారవుతుంది

గళ్ళు గళ్ళుగా పేర్చి
ఆమలో కాలుస్తుంటే
కళ్ళనిండా నీళ్ళు
చేతులూ కాళ్ళూ మండుతున్నా
అందమైన ఆకృతికోసం
ఆ కళ్ళు
రోజుల తరబడి
ఎదురుచూస్తుంటాయి

ఇటుక కనబడగానే
కళ్ళల్లో
ఆనందపు జ్యోతి వెలుగుతుంది

వొళ్ళంతా మండుతున్నా
ఇటుకబట్టీ కూలీకి
మిగిలేది
ఆకలి కేకలే కాదు
కళ్ళకు మంటా... కాళ్ళకు తంటా...
వానముసురు పడితే చాలు
ఇక్కట్ల ఇటుక ఆమ
ఆకలితో
హఠాత్తుగా ఆరిపోతుంది...

పల్లెపటం

ఇప్పుడు
పల్లెపటం మారిపోయింది
ఆత్మవంచన గాలిపటమై ఎగురుతోంది
డాలర్ మోజు
కాలర్ ఎగరేస్తుంటే
ఒకరినొకరు వింతగా చూసుకుంటున్నారు
కడుపునింపే ధాన్యం కళ్ళం
బోసిపోయిన 'వృత్తాకార'మై వెక్కిరిస్తోంది

గాదెలేదు, గింజలూలేవు
చేటలు ఇంకెందుకు...?
ఖండఖండాలయిన నేల
వాణిజ్యపు బోర్డులు మెడకు తగిలించుకొని
ప్రమాదపు హెచ్చరికల్లా వుంటాయి
పిచ్చిమొక్కలు తుప్పలు
విచ్చలవిడిగా పెరిగి
వ్యవసాయ పనిముట్లకు
అటక అడ్రస్ అయింది

కొత్తతరానికి
నాగలీ తెలియదు... గొర్రూ ఎరగరు
కొడవలి, లిక్కి దోకులు పార, చలగపార
అవసరమేముంది...?

లాభనష్టాల బేరీజులో
పశువుల పెంపకమూ శుద్ధ దండగై

ప్యాకెట్లు ప్యాకెట్లుగా
ఇళ్ళు నిండుతున్నాయి
యంత్రపు శబ్దాల హోరులో
ఎద్దుల గంటలు మూగబోయాయి

కరెంటు పోయిందంటే... పాపం
కుక్కర్ కూడ నోరుతెరవదు
పెరట్లో పాదులు మోటై
'ఫ్రెష్' షాపుల వైపు పరుగులు...
బియ్యానికీ, బిర్యానీకీ
బ్రాండ్ నేమ్‌లొచ్చాయి

ప్రేమానురాగాలు ప్రియమై
ఇప్పుడు
పల్లె
శోభకోల్పోయిన పడుచు
బతుకు పరిమళాలు
లుప్తమైపోతున్న అడుసు



‘వెదురు’ చూపు

బుట్టా తట్టా గంపా జల్లా
అల్లిక ఏదైనా
అపురూపం
కాలుష్యం అంటని
శ్రమసౌందర్యానికి ప్రతీకలై
జన జీవనంలో భాగమయ్యేవి

ఇప్పుడు
బతుకు అల్లిక గజిబిజి
బుట్టలెన్ని అల్లినా
బువ్వకి లోటు
చేటలెన్ని చేసినా
తిండిగింజలకి కరువు
రెక్కలు అలిసినా
రోజు గడవదు

తలదాచుకోవడానికి నీడలేక
రోడ్డుపక్కనే జీవనం
ప్లాస్టిక్‌లూ ఫైబర్లూ
సైబర్ బాటపట్టిస్తూంటే
కొత్తపనులు వెతుక్కుంటూ కొందరు
కులవృత్తిని వీడలేక ఇంకొందరూ

నిచ్చెన చెక్కే నిపుణులైనా
సమస్యలనుంచి పైకివచ్చే
ఆదరవు కరవు
వెదురువస్తువు వాడే వాళ్ళే అరుదై

కూలి డబ్బు కూడ అస్తు బిస్తూ...
ఊపిరిసలపని వత్తిడినుంచి
ఉపశమనం ఇచ్చే
విసనకర్ర లేదు

వెతలసుడి గుండం నుంచి
మేదర్లు ఏదరికి చేరతారో
మెతుకుకోసం
వెతుకులాటతోనే
సమయం సరి..!?

ఉల్టా ఉగాది

ఇవాల్టి పిల్లలకి
వావీ వరసలు తెలియదు
తెలిసిందల్లా రెండే బంధాలు
మమ్మీ-డాడీ... ఆంటీ-అంకుల్...

ప్రపంచమంతా ఒకటే భాష
ద్రవ్య భాష
కళ్లెదుట వెక్కిరించే ఆశ్రమాలు రెండు
పెద్దోళ్లకి 'వృద్ధాశ్రమం'...
పిల్లలకి 'చిల్డ్రన్స్ హోమ్'...

సెల్ ఫోన్, వాటర్ బాటిల్
దేహంలో ఇప్పుడు ప్రత్యేక భాగాలు
ప్రకృతి వికృతిగా మారిపోతూంటే
అన్నీ కృత్రిమమే.

ఉగాదీ అంతే...
ఊహల ఊసుల్లోనే...
బ్రాండెడ్ పచ్చడి
రుచినే కాదు...
రుచుల సంఖ్యనూ
మార్చేస్తుంది

బుల్లి తెర నుంచీ
సెల్‌ఫోన్ నుంచీ
కోయిల కూతలు వినిపిస్తున్నాయి
రాశిఫలాలు బోసిపోతున్నాయి

కందాయ ఫలాలు
కుంటి నడక

ఉగాదే కాదు...
పండుగలన్నీ
పల్లెలు పట్నాల పొలిమేరలు దాటి
మీడియా ముంగిట
మూన్నాళ్ల ముచ్చటవుతున్నాయి

ఇప్పుడు ప్రపంచమొక మార్కెట్
మనిషి
అందులో
అమ్మకపు సరుకు...!?

కాసేపు విరామం

నాకు
విశ్రాంతి అంతగా అవసరంలేదు
అడపా దడపా
కాస్త విరామం కావాలి
విరామం అంటే
'కామా' అంత ఖాళీ
'ఫుల్‌స్టాప్' అంత ఆలస్యం కాదు
విరామమంటే
మనల్ని మనం ఉత్తేజపరచుకోవడమూ
కాస్త పునరాలోచించుకోవడమూ

పురిట్లో నుంచి
కాటికి వెళ్ళే దాకా
మధ్యలో ఎన్నో విరామాలు
జీవితం ఒక సుదీర్ఘ కావ్యం
చివరి ఫుల్‌స్టాప్ దాకా
అందరిలోనూ
ఒకటే ఆలోచనల హడావుడి
కొందరివి దురాలోచనలు కూడా
కొందరు నిత్యం విశ్రాంతి కావాలంటారు
గుండెకి విశ్రాంతి ఎక్కడుంది...?
కాస్త విరామమూ ఉండదు
మెదడు ఆలోచనలను ఆపేస్తోందా?
ఎప్పటికప్పుడు
శరీరానికి సంకేతాలు
పంపుతూనే ఉంటుంది కదా!

మనసు
మంచి ఆలోచనల
లోగిలి కావాలి
ఇంద్రధనస్సై విప్పారాలి
ఈ దేహం
మట్టిలో కలిసిపోయేదాకా
నాకు విశ్రాంతి అవసరం లేదు
అప్పుడప్పుడూ
కాస్తంత విరామం చాలు

సోమేపల్లి కవిత్వం

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

7వ కవితా సంపుటి

మట్టి పొరల్లోంచి...

